ఆంధ్రమహిళ

(6)

అగస్టు, '60

ANDHRA MAHILA

AUGUST 1960


SIXTEENTH YEAR OF PUBLICATION

Andhra Mahila Sabha, Mylapore, Madras.

ఆంధ్రమహిళ

సంపుటి 16 ఆగస్టు '60 సంచిక 8

వ్యవస్థాపకురాలు. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్



కీ॥ శే॥ గోవిందన్

గోవిందన్ మనసభ కారు డ్రైవరుగావుండేవాడు. జీతపురాళ్ళకోసమే కాకుండా ఒక నిర్దుష్టమైన సంస్థకు సేవ చేయగలుగుతున్నా మనే సంతృప్తితో గర్వముతో పనిచేసేవాడు నోరు తెరుచు "ఇంక్రిమెంటు"కు కాని "అప్పు"కు కాని ఎప్పుడూ ఒత్తిడి చేసిన పాపాన్ని పోలేదు వినయముతో, ఉత్సాహముతో తన 'డ్యూటీ'ని నిర్వహిస్తూ అసువులు బాసిన ధన్యజీవి సోదరుడు గోవిందన్.

అమ్మా వళ్ళు బాగుండలేదు సాయంకాలం పనికి రాలేనని కబురంపాడు పదిరోజులు గడవకముందే జూలై 14 వ తేదీన మృత్యువాత పడ్డాడు ఆ ముందురోజే దుర్గాబాయమ్మగారు అతనిని ఆసుపత్రిలో చూసినప్పుడు, "అమ్మా, నమస్కారం" అన్నాడు అదే గోవిందకు ఆంధ్ర మహిళా సభకు కడపటి ఋణబంధం. ఆంధ్ర మహిళాసభ గోవిందని మర్చి పోవడం కష్టం.



వేసవిలో చల్లదనానికి....

చేనేత వస్త్రాలు ధరించండి

మన తాత ముత్తాతలు కూడా వేసవిలో చల్లదనానికి చేనేత వస్త్రాలు ధరించేవారు. చందేరి చీరెలు, మృదువైన మస్లినులు, ఎన్నో రంగులలో తయారయే 'ముడికట్టు' వస్త్రాలు, డోరియాలు– ఎన్నో! అన్నీ చల్లదనాన్నిచ్చే వేసవి దుస్తులుగా ఉపయోగించవచ్చు

సరసమైన ధరలకు శ్రేష్ఠమైన వస్త్రాలు.

ఆల్ ఇండియా హాండ్‌లూమ్ బోర్డు

తపాలు సంచి నెం. 10004, బొంబాయి.

DA 60/200

వరలక్ష్మి వ్రతము

శ్రీమతి జి. సుందరీశంకరం

మానవాళికి కోరికలు అనంతము. ఈ అనంతమైన కోరికలు నెరవేర్చుకోవాలన్న అభిలాషతోనే మానవులు జీవిస్తున్నారు. జన్మాంతము వరకు తమ అభిలాషలను, ఆశయములను నెరవేర్చుకొను ప్రయత్నములోనే నిమగ్నులై యుంటారు శతకోటి దరిద్రాలకు అనంతకోటిఉపాయాలన్నారు తృప్తిలేనిదే మానవజీవితమునకు శాంతిలేదు శాంతిలేని జీవితము దుర్భరము—దుస్సహము అవుతుంది ఈ తృప్తికి అధిష్ఠానదేవత మనస్సే ఈ మనస్సుని తృప్తి పరచుకోటానికి చేసే ప్రయత్నాలలో భగవదారాధన ఒకటి. ప్రయత్నలోపం లేకుండా నియమబద్ధమైన జీవితాన్ని గడపటంలోనే తృప్తివుంటుంది మనస్సుకి శాంతి యేర్పడుతుంది. కనుకనే పండుగలు వ్రతాలు నోములు సంవత్సరం పొడుగునా మనపూర్వులు నిర్ణయించుకొని ఆయా దినములలో ఆయా నోములు, వ్రతాలు, పండుగలు, శ్రద్ధగా చేసుకునేవారు—చేసుకుని తృప్తిపడేవారు. ఇవి స్త్రీలకు పురుషులకు సమానంగానే నిర్ణయింప బడినా స్త్రీలు ప్రత్యేకించి ఆచరించ వలసిన వ్రతములు నోములు కూడావున్నాయి అందులో ఒకటియైనదే ఈ వరలక్ష్మీ వ్రతము. ఇది శ్రావణ మాసంలో వస్తుంది శుక్లపక్షంలోనే పౌర్ణమికి ముందు వచ్చిన శుక్రవారంనాడు ఈ వరలక్ష్మీ వ్రతాన్ని ప్రతియింటా స్త్రీలు ఆచరిస్తారు

ఉదయమే లేవడం. ఇల్లూ, వాకిళ్ళూ, చెంబులు తప్పేలాలు మొదలైన వాటిని శుభ్రపరచటం, దేవుని మందిరాన్ని అలంకరించడం—లక్ష్మీస్థానమున కలశమును పెట్టి ఆ కలశాన్నికూడ రకరకాల ఆభరణములతో వస్త్రములతో అలంకరించి పూజచేసుకోడం జరుగుతుంది దీనివలన సకల సౌభాగ్యదేవతయైన లక్ష్మీదేవి మనకు కావలసిన సమస్త ఐశ్వర్యములను యిచ్చి మన కోరికలను నెరవేరుస్తుందని మనస్సుకి ఒక విధమైన తృప్తి ఆత్మశాంతి కలుగుతుంది.

మున్నూట అరువదిఐదు రోజులు ఈ విధమైన పండుగలు, పూజలు, వ్రతాలు, నోములు పర్వదినములు, మన పూర్వులు నిర్ణయించి వుంచారు సంవత్సరము పొడుగునా వాతావరణము ఒక్క సూదిరిగా వుండదు. ఆరు ఋతువులు వస్తాయి పోతాయి కొన్ని మాసములలో పగటి వేళలు దీర్ఘంగాను, రాత్రులు హ్రస్వంగాను, వుంటున్నాయి కదా! మాసంకూడా శుక్లపక్షమనీ, కృష్ణపక్షమనీ విభజింప బడినది. సంవత్సరం పొడుగునా వాతావరణము మారుతూనే వుంటోంది వాతావరణమునకు అనువైన వ్రతాలు, ఆయా దినములలో ఆయా మాసములలో ఆయా పక్షములలో ఆయా తిథి, వార, నక్షత్రములలో నిర్ణయించారని స్పష్టమౌతోంది మన పూర్వుల ఈ నిర్ణయానికి ఒక విశిష్టత ప్రత్యేకత ఉందని చెప్పక తప్పదు కణకణలాడే ఎండలతో వేసవి గడచిపోతుంది భూమి బాగా ఉష్ణముతో తపించి పోతుంది. వసంత ఋతువు గ్రీష్మఋతువులు గడచిన తరువాతనే శ్రావణమాసంతో వర్షఋతువు ప్రవేశిస్తోంది ఎండకు యెండి బీటలు వారిన భూమి వరఋతువు యొక్క ఆగమముతో సఫలీకృత మనోరథయై సస్యశ్యామలమై ఫలిస్తుంది ఈ ఫలోన్ముఖమైనభూదేవి మనకు సకల సౌభాగ్యమును ప్రసాదిస్తుంది. ఆయురారోగ్యాఐశ్వర్యాభివృధ్వరమే స్త్రీలు శ్రావణమాసమున శుక్లపక్షంలో వచ్చే శుక్రవారము వరలక్ష్మీ వ్రతాన్ని అతి శ్రద్ధా భక్తులతో ఆచరిస్తారు. మన హిందూదేశపుస్త్రీలకి, అందులోనూ ఆంధ్ర మహిళకు ఈ వ్రతవిధానం తెలియకుండా వుండదు. అది ఆచరించి ఆశయసిద్ధిని పొందకుండా వుండరు.

ఓమ్‌శ్శాంతి శ్శాంతిః ★

కృతజ్ఞత

శ్రీమతి పర్మ గోయాల్.
శ్రీమతి పి. జ్ఞానాంబాఓబుల్ రెడ్డి.
శ్రీమతి డి. లలితాంబ పార్థసారధి
శ్రీమతి పుష్పవతికపూర్.

వీరందరూ చెరియొక నూరు రూపాయలిచ్చి సభకు యావజ్జీవ సభ్యులైనారు. వీరికి మా కృతజ్ఞత.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the month of July, 1960.

OUT-PATIENT REGISTER

No. of Surgical cases treated	50
" " Medical " "	866
" " Gyneac " "	121
" " Ante-natal " "	302
" " Post-natal " "	74
" " Dental " "	15
" " E.E.N.T. " "	80
Tota " " New Patients	1,508
" " " Old Patients	2,056
Grand Total	3,564

IN-PATIENT REGISTER

No. of Patients admitted of Normal Deliveries	138
" " " " Abnormal Deliveries · Deliveries. (Forceps-13)	13
No. of Ante-natal E False Pains	24
" " Ante-natal E Toxeamia	2
" " Gynaec cases	19
" " Medical "	93
" " Surgical "	4
" " Post-natal "	3
" " Babies admitted as Lodgers	155
Grand Total	451

Sd.) Dr. K. R. AMBUJA, R M. O.

(Sd.) Dr M. PAVANA BAI, *Medical Superindent.*

(Sd) Smt. V LAKSHMI PARVATHI *Secretary.*

కూతురు కాపురం

శ్రీ మండ రామారావు

గోపాలయ్యగారు బడికి అందరేమోనని భయం భయంగానే వున్నా పేపర్ల కట్టలు మాత్రం దిద్దుతూనే వున్నారు. దిద్దుతూన్నంతసేపూ అతని తలలో ఆలోచనలు ముసురుకుంటూనే వున్నాయ్. 'సంక్రాంతి వస్తూంది. ఎన్ని సంక్రాంతులు రాలేదు పోలేదు! ఇది మూడో సంక్రాంతాయె. పోనీ ఈ సందుక్కయినా యిద్దరూ చిలకా గోరింకల్లా యింట్లో మసలితే ఎంత ఆనందం! జీవితమే సార్ధకమైనట్టుగా. అబ్బ! రెండుసంవత్సరాలే ఎడబాటు? ఏమిటీ పట్టింపులు? ఇరు వైపులా పట్టుదలలు సడలకుండా వుంటే పరిష్కార మార్గం కుదిరేదెప్పటికి? ఎవరైనా వెనక్కు తగ్గొద్దూ! తను మొదట్నుంచీ తగ్గే వున్నాడే. మరి....రాధ... అవును. దీనికంతటికీ కారకురాలు రాధే.

గోపాలయ్యగారి ఆలోచనలకు అంతరాయం ఏర్పడిందిపోస్టుబంట్రోతు కేకతో. హడావిడిగా వెళ్ళి ఉత్తరం అందుకుని. దస్తూరిచూచి, చించి ఆతృతకొద్దీ ఆమూలాగ్రం చదివారు.

అప్పటికే పదిగంట లయింది. బడికి వేళయిందని తెల్సినా ఆ సమయంలో ఆధ్యాసే లేకపోవడానికి కారణం అజాబే. రెండు కుటుంబాలమధ్య సమరస భావం సాధించేందుకు అవతలివారు చేస్తూన్న ప్రయత్నాలకది ఋజువు పత్రం.

అలాగే ఉన్నపళాన వంటింట్లోకి దూరి "ఏమేవ్... ఉత్తరం వచ్చిందే" తృప్తిగా తొందరగా అన్నారు.

"అక్కడ్నించేనా?" ధీమాగా అడిగింది భార్య రాధ.

"అవును. పంపమనే. అంతగా వీలుకాకపోతే తనే వస్తాట."

"వస్తాడు ...ఎందుకురాడూ? ఇంకేమైనా తరవాయి వున్నాయి గాబోలు హింసలు పెట్టడం? అందుకోసమేగా వచ్చేద" రుసరుసలాడింది.

గోపాలయ్యగారికి అరికాలిమంట నెత్తికెక్కింది. శుభమా అని సంతోషంకొద్దీచెప్తే ఏమిటీ కోపతాపాలు? "ఎవరితో మాట్లాడుతున్నావో తెల్సుకున్నావా?"

"తెల్సు ... నా కన్నీతెల్సు. తెలివిగానే వున్నాను. మీ మాటలునమ్మి ఇంకేమీ చేయదల్చుకోలేదు.... అంతే" నిక్కచ్చిగానే అనేసింది.

"ఏం? నామాటలునమ్మి చేసినందుకేంవచ్చిందీ?" గట్టిగానే అన్నారు.

"వద్దువద్దని నెత్తీనోరూ మొత్తుకున్నా విన్నారూ అప్పుడు? సంబరపడి చేసారు. ఎవరనుభవిస్తున్నారిప్పుడు?"

"ఏమైందని? చూజూస్తూ మమకారంకొద్దీ అట్టేపెట్టుకున్నావు. ఎన్నిసార్లు చెప్పాను అజ్ఞానంకొద్దీ అదివస్తే దాన్ని పుట్టింట్లో వుంచమన్నానా? అదేనానీ ధర్మం?"

"నేనేం చేసానని? అదే వెళ్ళనందిగా!"

"అవును. అదివెళ్ళనంటుంది. నువ్వు పంపనంటావు. నల్గురూ వినీ, చూసీ నవ్వరూ మనప్రవర్తనకు. దానికాపురం నిలబెట్టే బాధ్యత మందికాదూ? తల్లివై వుండీ, అన్నీ అనుభవించి కూడా విస్మరించేవా? నీ పెళ్ళయిన పిదప నువ్వెన్నిపాట్లుపడ్డావో గుర్తుకు తెచ్చుకో. ఉన్నాలేకపోయినా నన్నే ఎందుకనుసరించావ్ ఈ గడ్డురోజుల్లో? ఆలోచనలేకుండా పట్టినపట్టే నెగ్గించుకోవాలనుకోవడం తెలివితక్కువతనం రాధా" జవాబుకోసమైనా ఎదురుచూడక బడికి వేళయిందని భోజనమైనా చేయక వెళ్ళిపోయారు గోపాలయ్యగారు.

అంతవరకు కరకూగుండెతో, సడలనిపట్టుదలతో భర్తకు జవాబులిచ్చిన రాధాబాయి కరిగి నీరైపోయింది. భర్త 'ఆలోచించుకో' అన్న హెచ్చరికలో ఎంత అంతర్యం యిమిడి వుంది! రాధాబాయి ఆలోచనల్లో ఒక్కసారిగా పాతిక సంవత్సరాల గతంలో అడుగు పెట్టింది.

తనూ, తమ్ముడూ సామాన్యకుటుంబంలో పుట్టినా వంశపారంపర్యంగా వస్తూన్న నాయరికంలో వచ్చేరాబడీ పలుకుబడీ మూలంగా ముద్దు ముచ్చటలు తీర్చుకున్నారు. ఆరోజులలో పసితనంలోనే వివాహాలుచేసి కూతుళ్ళ కాపురాలు నిర్జీవధామాలుగా చేయడం అన్నవాయితీగావున్నా రాధాబాయి తలిదండ్రులు మాత్రం కూతురికి యుక్త

వయస్సు వచ్చినాక తాహతుకు సరిపోయిన లేక తక్కువయిన సంబంధమే చేయాలన్న నిశ్చయంలో అల్లుని అన్వేషణ సాగిస్తూనే కృత కృత్యులయారు. కాని రాధాభాయి ఆ సంబంధాన్ని సుతారమూ అంగీకరించక పోవడానికి కారణం ఉన్నవారు కాకపోవడమే.

పల్లెటూరి చదువుతో చాలించినా రాధాభాయి గడుసైనది. తనపట్టే నెగ్గించు కోవాలనీ, ధనవంతుని యింట్లో పడాలనీ ఆశించి తండ్రితో వాదనకు దిగింది.

"అమ్మాయ్ : బీద భాగ్యంతో నిమిత్తం లేదమ్మా. సిరిసంపదలు నేడుంటాయ్, రేపు మంట గలుస్తాయ్. కాని గుణగణాలూ, చదువుసంధ్యలూ సదా వెంటాడి మనిషికి రాణింపు చేకూరుస్తాయ్ ఎంత ధనవంతులైనా, బీదవారైనా, తలిదండ్రులు చేజేతులా కష్టాలపాల్జేస్తారా కూతుర్ని? అదీకాకుండా తాహతుకు మించే సంబంధాలు వెదకి, యావదాస్తీ కరిగించి కట్నాలుపోసి అల్లుళ్ళను కొనుక్కున్నామే అనుకో. తరువాత ఏం సుఖించగల్గుతారని? అలా డబ్బిచ్చి మంచి మనసును కొనలేమమ్మా. అందుకే మనకంటే లేనివాడని తెల్సినా ఎంచుకున్నాం. ఎటువంటి గుణవంతు డనుకున్నావ్ !" మనసులోనే కోరికలూరించారు.

కని-పెంచి-పెద్దచేసిన తలిదండ్రులను ఎదిరించాలన్న ఆలోచనలు కొన్త మటు మాయమైనా, 'ఈ సంబంధం చేసుకుంటే కష్టాలు తప్పవని మనసు పదేపదే హెచ్చరిస్తున్నా అంగీకరించ వలసివచ్చింది.

మెట్టినింటి పరిస్థితుల నాకళింపుచేసుకుని నెలరోజులలోనే ఆశ్చర్యపోయింది. తనూ, అత్తగారూ, భర్తా, మరదలూ, మరదీ ఒక్కని జీతంమీద ఆధారపడుతూ బాగోగులు చూసుకోవాలి. సాధ్యపడదని మొదట్లో భావించినా అత్తగారి గృహనిర్వహణ పద్ధతి కళ్ళార చూచి మురిసిపోయింది. సంసారం అన్నతర్వాత కష్టాలు రాకపోతాయా? నెలరోజులలోను రెండు మూడుదినాలు పస్తులుండాల్సి వచ్చినా తనకదేమీ కష్ట మనిపించలేదు. తనకంటే చిన్నవారైన మరదీ, మరదలూ పస్తులుండి కూడా చదువు సాగిస్తున్నారంటే సంతోషంలో ఆశ్చర్యం కల్గదూమరి? పోనీ లేదని పుట్టింటికి కబురు చేదామనుకున్నా భర్త అందుకు అంగీకరించేవాడుకాదు.

"రాధా ! మనకాళ్ళమీద మనం నిలబడ గల్గినప్పుడే మనగొప్ప. ఈ రోజున లేదనివెళ్తే యిస్తారు. దినదిన గండంగా గడిచే ఈ సంసారయాత్రలో ఎన్నిసార్లు ఏ ముఖం పెట్టుకుని సహాయం అర్థించుతాం? తల్లీ-తండ్రీ వున్నా ఎందుకా మమకారం నీకు? వివాహమయినాక అంతగా అభిమానానురాగాలు కల్పించుకుని పుట్టిల్లు చేరకూడదు. అందువల్ల నువ్వు చులకనైపోవడమేగాక మమ్మల్ని కూడా చులకనచేసినదానవవుతావ్"

రాధాభాయికి ఆపాటి సంస్కారం వుండబట్టి భర్త మాటలు తలకెక్కాయి. తత్ఫలితంగానే ముందటిలేని వారనే భావం పోవడమే కాకుండా మనస్ఫూర్తిగా భర్తననుసరించ గల్గింది.

రాధాభాయి శరీరం ఒక్కసారిగా జలదరించింది.

అపును మొదట్లో తను తిరస్కరించిన సంబంధాన్నే చేసుకోవడంవల్ల భర్త అనురాగాభివృద్ధులనూ, అత్త అలపానాన్నీ, మరది వాత్సల్యాన్నీ పొందగల్గి తన చేతుభిమీదుగా మరదల్ని ఒకయింటి దానిగా చేయగల్గింది. ఆ అనుభవాలూ, కీర్తి, ఎవరికి దక్కినట్టు? తనకేగా ! !

కాని-కాని- అనుకోకుండా అత్తగారు కాలధర్మం చేసారు. తన భర్తకు తల్లి, కనిపెంచి శ్రేయస్సు నాకాంక్షించే మాతృదేవత కాలంచేయగానే భర్త కీలోకంతో సంబంధం లేనట్టయిపోయింది. తిరిగి మొదటి సంతానం కూతురి జననఫలితంగా ఈలోకంలో పడగల్గారు. చుట్టుపక్కలంతా తిరిగి తల్లే పుట్టిందని మురిసిపోయారు సాక్షాత్తు లక్ష్మీదేవి పుట్టిందని అందరూ కొనియాడారు. తర్వాత ఒక్కగానొక్క కొడుకుపుట్టి నేత్ర పర్వంగావించాడు. అంతే. మరి సంతానం లేకపోయింది. ఆ సంతానాన్నే కన్నుల కరవుదీరా చూసుకుంటూండగా కాలచక్రం గిర్రుని తిరిగి కూతురి పెండ్లిసమస్యతెచ్చి పడేసింది. ఆదంపతులు తల్చుకుంటే డబ్బుకు లోటులేకుండా ఘనంగా వివాహం చేయగలరు. కాని ఏ సంబంధం చేయాలన్న సమస్య వచ్చిపడింది. రాధాబాయి తన తమ్మునకిచ్చి చేయాలని పట్టుపట్టింది. అందుకు గోపాలయ్యగారు అంగీకరించలేదు. కారణం అప్పట్లో వారు స్థితిపరులే అయినా బావమరది గుణగణాలు అంతగా నచ్చక పోవడమే. అదీగాక పట్నంలో ఎవరి సహవాసమోచేసి ఇల్లూ-ఒళ్ళూ గుల్ల చేసుకుంటున్నాడనేవార్త కర్ణాకర్ణిగా విన్నారుకూడా. ఇన్ని బలమైన కారణాలుచూపి చివరకు తనపట్టే నెగ్గించుకుని చదువుకుంటూన్న యువకునకిచ్చి బరువు దించుకున్నారు. స్థిరమైనయిల్లూ, ఉద్యోగిగా వుంటూ ఆర్జిస్తూన్న మామగారూ, అలించి లోటుపాట్లు వచ్చినా సర్దుకుపోయే అత్తగారూ కూతురికి లభించడం ఎంతో అదృష్టమని తనూ కొడుకూ భావించారు.

వివాహమయినదాది స్త్రీకి భర్తేగా సర్వస్వమూ. పుట్టి నిల్లూ, పరిసరాలూ వీడలేక భర్త కృష్ణమూర్తి ననుస రించవలసి వచ్చింది లక్ష్మి. క్రొత్త వాతావరణంలో అడుగు పెట్టీపెట్టగానే భర్తను ఎడబాయ వలసివచ్చింది. వారంరోజులు. కారణం కాలేజీయువకులతో ముఖ్యనగ రాలూ, ప్రాముఖ్య ప్రదేశాలూ సందర్శించి విజ్ఞానార్జన చేయడానికి కృష్ణమూర్తి పయనించడమే. భర్త వెళ్ళిన నాటినుంచి లక్ష్మికేమీ తోచలేదు. పరిచయులెవరూ లేక పోయారు. పుట్టింటి మమకారంలో ఏవేవో ఆలోచనలు అల్లిబిల్లిగా అల్లుకుని తన మనసును చిందర వందర చేశాయి. అలవాటు ప్రకారం అత్తమామల ననుసరించ లేకపోయింది. ఏదో తీరనిలోట్లు కల్గినట్లు ప్రవర్తించ సాగింది.

ఒకరోజు ఏడుగంటలయినా లేవలేకపోయింది. అత్త గారు ఎంతిగా లేపినా ప్రయోజనం లేకపోయింది. పోనీ లేచిన పిదపనే కాఫీ ఈయవచ్చని తలచి తన పనులలో నిమగ్నురాలైంది అత్తగారు. ఎలాగైతేనేం కోడలు ఎని మిదింటికి లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాక కాఫీయిస్తూ "లక్ష్మి! ఇంతివరకూ పెందలాడే లేచేదానివి ఇవాళేం అలస్యంగా మేలుకున్నావ్? ఒంట్లో బాగాలేదా!" అను నయంగా అడిగింది.

కోడలు జవాబు చెప్పలేదు కాని ముఖకవళికలలో మార్పుతెచ్చు కోవడం గమనించింది అత్తగారు. మూడు రోజులు అదే అలవాటైంది. అదే ప్రశ్నవేస్తూ అత్తగారు అభిమానించారు. కాని చివరకు లక్ష్మి సహించలేక "నా యిష్టం ఏం? ఆలస్యంగా లేస్తే యేం?" రుసరుసలాడుతూ అంది, ఆటువంటి జవాబు తనువింటుందని అనుకోలే దింత వరకూ అత్తగారు. కోడలు మనసులో ఏదో ఎందుకో రగులుతూందని నిశ్చయించుకుంది. కృష్ణ మూర్తి రాగానే అలక సేవించిన కోడల్ని చూసి అత్త మామలు హడలిపోయారు ఏపాపమూ ఎరక్క పోయినా.

అంతే .... పుట్టిల్లుచేరుకుంది లక్ష్మి. రెండు సంక్రాం తులు గతించినా అత్తింట్లో అడుగు పెట్టలేక పోయింది.

గతమంతా కళ్ళకు కట్టగానే 'ఎంత అన్యాయం జరి గింది! చిన్న చిన్న విషయాలను పట్టించుక్కోవడం వల్ల కూతురు కాపురంలో రెండు సంవత్సరాలు నిర్జీవంగా దాటిపోయాయే! అభిమానం వుంటే అచ్చటా ముచ్చటా తీర్చుకోవాలిగాని ఇలా తనవారి మాటలను నిజమో అబద్ధమో తెల్సికోకుండా నమ్మి నెత్తికెక్కించు కోవడం ఎంత పొరబాటు! 'లోలోన నిజం తెల్సుకుని కుమిలి పోయింది రాధాబాయి. 'ఎలాగైనా సరే ఈ సంక్రాంతికి అల్లుని ఆహ్వానించాలి. కూతురు కాపురం నిలబెట్టి నా కర్తవ్యం నేను నెరవేర్చుకోవాలి' నిశ్చితాభిప్రాయానికి వచ్చిందప్పుడే. అదే తరుణంలో కొడుకు రఘునాథం రావడమూ, బట్టలు సర్దుకోవడమూ జరిగిపోయాయి.

"ఏమిట్రా ఈ హడావుడి?"

"జరూరైన పనిమీద వెళ్ళాలమ్మా"

"ఎక్కడికి?"

"కాకినాడమ్మా"

"కాకినాడా? నాన్నగారికి తెల్సునా? ఏమైనాచెప్పారా? ఎప్పుడు వెళ్ళేది?" ప్రశ్నల వర్షం కురిపించింది.

"నాన్నగారు నాతో ఏం చెప్పలేదే" ఒక్కదానికే సమాధాన మిచ్చాడు.

"చెప్పలేదూ?!" ఆశ్చర్యమూ ప్రశ్నార్థకమూ వెలి బుచ్చింది.

"ఏమున్నాయని చెప్పడానికి? ఇప్పుడువెళ్ళి రేపుద యమే వచ్చేస్తానుగా"

"ఉందిరా ... చాలముఖ్యమైన విషయమేవుంది .... పండుగ వస్తూందికదూ!"

"అవును.... వస్తూంది ... వస్తే బట్టలకోసమేనా?.... ఇక్కడ దొరుకుతాయిలే"

"బట్టలు కాదురా.... పండుగ పిలుపుకోసంరా...."

"అదేమిటమ్మా ఎవర్ని పిలవడం?" తెలియనట్లే అన్నాడు.

"ఎవరున్నారని.... మీ బావగార్నే పిలవాలి."

"బావగారినా? అలవాటులేని భాగోతమా?"

"ఉత్తరం వచ్చిందిగా లక్ష్మిని పంపమని"

"వచ్చిందీ? ఎప్పుడూ తను పంపమని వ్రాయడం పొరపాటు! మనకు ఇంట్లో అట్టే పెట్టుకోవడం అల వాటు. ఏం అంతేనా అమ్మా?"

"ఇంతవరకూ జరిగిందేదో జరిగిపోయింది. ఇకనైనా దానికాపురం నిలబెట్టకపోతే ఎలారా!" దీనంగా తప్పంతా తనదేనన్నట్లు అంది.

"ఇంతకూ ఎవరు వద్దన్నారని?"

"ఎవరూ వద్దనలేదు. నా బుద్ధి గడ్డితిందింత వరకూ నన్ను మరి మాట్లాడించకు."

తల్లి ప్రవర్తనలో మార్పు వచ్చిందని సంతోషించినా అది తాత్కాలికమేమోనని సంశయించాడు రఘునాథం.

"వేళయి పోతూందమ్మా. పన్నెండు గంటల రైలుకే వెళ్ళాలి."

వెళ్ళి సంక్రాంతి పండుక్కి మీ బావగార్ని రమ్మని చెప్పాలి"

"నాన్నగారేమంటారో! ఇంతకీ నే చెప్తే బాగుంటుందా?"

"నాన్నగారేమీ అనరు. నాన్నగారు మొదట్నుంచీ శతపోరుతున్నా నేను వింటేగా! నాన్నగారి మాటగా చెప్పి వీలయితే స్వయంగా తోడ్చుకురా, పండుగ వారం రోజులేగా వుంద. నా అనుమానం మూలంగానే యింత వరకూ అజ్ఞానంలో కొట్టుకున్నాను. ఇప్పటికి గాని నా కళ్ళు తెరవబడలేదు." దీనంగా పశ్చాత్తాపపడుతూ అంది.

"మంచిదమ్మా. ఇన్నినాళ్ళకయినా మేలుకున్నందుకు ఇంతకీబావగారింటికి వెళ్ళడానికి వేళవుండదమ్మా. ఆఫీసు పనితోనే సరిపోతుంది. పోనీ వుందామన్నా శలవుకూడా లేదాయే" బెట్టుసరి చూపాడు.

"అల్లాగంటే ఎలారా? నీ చెల్లెలుగురించి ముఖ్యంగా యింటి పరువుమర్యాదల గురించి ఈపాటి చెయ్యలేవూ- వెళుతున్నావు కాబట్టి చెప్తున్నాను లేకపోతే మీ నాన్న గార్నే పంపిద్దును."

రఘునాథ మనసులో సంతోషించాడు. తల్లిలో పూర్తిగా పరివర్తన కల్గిందని, "సరేనమ్మా! వీలునుబట్టి చేస్తాను" తల్లి ఆజ్ఞను శిరసావహించి "చెల్లాయికి చెప్పొద్దూ యీ సంగతి?" గదిలోనికి వెళ్ళబోయాడు.

"అదేం చెప్తుందని? భర్త ననుసరించాలని దానికితెలియదూ!" సమాధాన పరచింది.

"అమ్మా! ఇంతవరకూ నీకు చెప్పకుండా దాచి పెట్టాను నాన్నగారే ఆఫీసుకువచ్చి ఈ పనిమీదనే నన్ను వెళ్ళమని తొందర పెట్టారు. అందుకే ఈ ప్రయాణం. వెళ్ళేముందు నీలో ఏమైనామార్పు వచ్చిందోలేదో తెల్సుకుని మరీ వెళ్ళ మన్నారు. అసలు విషయం దాచిపెట్టి నీచేతనే బావను పిల్పించేలా చెప్పించాను. తప్పయితే క్షమించమ్మా" తలొగ్గాడు రఘునాథం.

"క్షమించడానికేముంది రఘూ. అందరూ నన్నే క్షమించాలి"

తలుపుచాటుగా నిల్చుని అన్నీవిన్న లక్ష్మి ఉబ్బి తబ్బిబ్బయింది. ఏదో పొరపాటు జరిగిందని అప్పట్లో తన ధర్మం తెలీక పుట్టిల్లు చేరుకోవడం ఎంతతప్పిదమో యిప్పటికి గాని అర్థమైందికాదు. ఎన్ని అవమానాలు, కష్టాలు వాటిల్లినా చలించక పతిననుసరించడమే జీవిత పరమార్థమని ప్రతిస్త్రీ భావించాలని స్థిర నిశ్చయానికి వచ్చింది.

♦ ♦ ♦

తనకు చిన్నతనమని తలచక, బెట్టుసరిచేయక కృష్ణ మూర్తి పండుకోసమని ముందుగానే వచ్చాడు. రావడ మేకాదు సకల మర్యాదలతో అభిమానింప బడ్డాడు. ఇంతవరకూ మనసులో దాచుకున్న రహస్యాలూ, అనుమానాలూ, భార్యతోచెప్పి బాధ ఉపశమింప చేసుకోవాలను కున్నాడు.

"లక్ష్మి! మా కుటుంబం ఏం తప్పు చేసిందని ఇలా శిక్షించావ్? నీ గురించి మేమెంతగా తపించి పోయేమో తెలుసా!" గోముగా తలనిమురుతూ సంక్రాంతినాటిరాత్రి ప్రస్తావించాడు,

మొదట్లో లక్ష్మినోటమాటరాలేదు. ఎన్నినాళ్ళకు మళ్ళీ భర్తతోటి సాంగత్యం! ఒళ్ళు పులకించింది. మాటలు ముత్యాల మూటల్లా వెలువరించింది. "నన్ను క్షమించండి, మిమ్మల్నీ, అత్తమామల్నీ అనవసరంగా కష్టపెట్టాను." తలదించేసుకుంది వెంటనే.

"అసలు సంగతి చెప్పావుకాదే" సాగదీసాడు కృష్ణ మూర్తి.

"కారణానికేముందనీ? అత్తగారు మంచిచెప్తే నోటి కొచ్చినట్టు అనేసాను. మీతో అసలు విషయం దాచి అత్తలమీద కసినివెళ్ళబోసే కోడలిలా కల్పించిచెప్పాను. పుట్టింటి అభిమానం నన్నిక్కడ కట్టిపడేసింది. ఇన్నాళ్ళకు మళ్ళీ...." పూర్తిచేయలేక పోయింది.

"నా సహవాసం లభించిందంటావ్! ఏం? అంతేనా"

"ఔనండి!" సిగ్గుదొంతరలు చుట్టి గిలిగింతలు పెట్టినట్టయింది.

"ఇప్పటికైనా నువ్వూ, మీ అమ్మా మారినందుకు చాల సంతోషం. ముద్దువర్షం కురిపించి" ఇంతకూ మన ప్రయాణం ఎప్పుడు?" అన్నాడు.

"మీ యిష్టం!" అతని గుండెలో తలదాచుకుంది.

పండుగ వెళ్ళిన మూడోదినాన ప్రయాణ మయారు.

"లక్ష్మి కాపురం ఇన్నాళ్ళకు గట్టునచేరింది కదండీ!" భర్తతో అని స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంది రాధాబాయి.

"మరేం ఫర్వాలేమిలే. ఇద్దరి తిక్కలూ కుదిరాయి. ఆలుమగలు వెళ్ళిపోయాక. కలలు కంటూన్న కూతురు కాపురం చక్కబడినట్టే" కూతురూ అల్లుడూ ప్రయాణించగా కన్పించి నంతమేరా చూసి చూసి సంతృప్తి వెలిబుచ్చారు గోపాలయ్యగారు ★

శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్ జపాన్ పర్యటన

పారిశ్రామిక రంగంలోనూ, వైజ్ఞానికరంగంలోనూ పురోభివృద్ధిని సాధించి, ప్రజల జీవన ప్రమాణాలు పెరిగిన సంఘంలో సాంఘిక సంక్షేమానికి అవసరం కాని, తావుగాని అక్కరలేదా? వచ్చిన స్త్రీ విద్యా విషయిక జాతీయసంస్థ కేంద్రసాంఘిక సంక్షేమసంస్థల అధ్యక్షురాలు, శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఇటీవల జపాన్‌యాత్ర ముగించుకుని ఢిల్లీనగరానికి తిరిగి వచ్చినప్పుడు ఈ ప్రశ్నకు సమాధానంగా తమ పర్యటనానుభవాలను చెప్పారు.

పారిశ్రామికంగా దేశం అభివృద్ధిచెంది ఉత్పత్తి పెరుగుతే నేటి సమస్యలన్నీ పరిష్కారమౌతాయని వాదించేవారుండకపోలేదు. కాని ఇది బహు కొద్ది మంది అభిప్రాయం మాత్రమేనని చెప్పాలి. ఈ నాడు పత్రికల్నీ తదితర ప్రచారసాధనాలనీ తమ గుప్పెట్లో పెట్టుకున్న బహుకొద్ది మంది మాత్రమే ఈ అభిప్రాయం కలవారు. కాని కోట్ల కొలది సామాన్య ప్రజల ఆకాంక్షల్నీ, ఆశల్నీ ఈ కొద్దిమందీ ఏ విధంగానూ మూగపరచలేరు. అందుచేత సాంఘిక సంక్షే



మమపై ఈ కొద్దిమంది అభిప్రాయాలనూ మనం ప్రామాణికంగా తీసుకోనక్కరలేదు" అని వక్కాణించారు.

సాంఘికసంక్షేమ పథకాలమీద వెచ్చించిన డబ్బుకి ప్రతిఫలంగా వస్తు రూపేణా ఏమీ కనబడటంలేదు కనుక ఇదంతా వ్యర్థమేనని వీరి వాదన. "ఈ అభిప్రాయంతో నేను ఏ విధంగానూ ఏకీభవించలేను. ఏమంటే ఇది ప్రజల సమస్య. బృహత్తరమైన ఈ సమస్యలను మనం ఇదిఖర్చు పెట్టడంవల్ల దీనిమీద మనకి రాబడి ఎంత వుంటుంది అనే దృక్పథంతో కాకుండా అనేక కోట్లమంది సాంఘిక సమస్యలు ఏ విధంగా పరిష్కార మౌతాయి?" అనే విశాల దృష్టితో చూడవలసి వుంటుంది పారిశ్రామికంగా మహత్తరమైన పురోగమనాన్ని సాధించిన అమెరికా, జపాన్ వంటి దేశాలలోకూడా, రకరకాల సాంఘికసమస్యలు వున్నాయి. ఆదేశాలలోకూడా వికలాంగులు, ప్రకృతిసిద్ధంగా అంగవైకల్యం కలిగిన వారూ వుండనే వున్నారు. అక్కడా వితంతువులూ, అంధులు, శారీరకంగానూ, మానసికంగానూ వెనుకపడ్డవారున్నారు. ఉదాహరణకి అంధులైన బాలురను మామూలుగా అందరూ చదువుకునే ప్రాథమిక పాఠశాలలకి పంపలేముకదా! వీరికి విద్యగరపడానికి ప్రత్యేక సాధనాలూ, సదుపాయాలూ వుండాలి. అదే విధంగా అంగవైకల్యం చెందినవారికి వారివారికి తగినవిధంగా ఏర్పాట్లు వుండాలి. కేవలం డబ్బు వీరి అంగవైకల్యాన్ని, ఇతర సమస్యల్ని తీర్చలేదు. అందుచేతనే ఒకదేశం యొక్క పారిశ్రామిక గతినిగాని, పారిశ్రామికంగా వెనుకపడి వుండడాన్ని గాని ఆ దేశపు సాంఘిక సంక్షేమ సమస్యలతో ముడి పెట్టరాదని నేనంటాను. "అత్యంత ప్రాచీనమైన, రామాయణ కాలం నాటి రామరాజ్యదర్శం నుంచి నేటి అధునాతన పాశ్చాత్య ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాల వరకూ దేనిని తీసుకున్నా శారీరకంగానూ మానసికంగానూ దయనీయమైన స్థితిలోవున్న మానవుల సేవ ఎప్పుడూ ప్రశంశనీయంగానూ, ముఖ్యమైనదిగానూ పరిగణింప బడుతూంది. అందుచేతనే సాంఘిక సంక్షేమం యొక్క ప్రాధాన్యాన్ని ఎన్నటికీ విస్మరించకూడదు.

ఈ దృక్పథంతోనే ఈనాడు ప్రతిదేశం సాంఘిక సంక్షేమానికి ఒక విశిష స్థానాన్నిచ్చి, అభివృద్ధి పథకాలని రూపొందించు కుంటూంది. ఈ సత్యాన్ని గహించే జపాన్‌దేశపు ప్రభుత్వం సాంఘిక సంక్షేమ మంత్రిత్వశాఖ ద్వారా విస్తృత పథకాలని రూపొందించి అమలు జరుపుతూంది.

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ "ఇంటర్నేషనల్ హౌస్ జపాన్" ఆహ్వానంమీద ఏప్రిల్ 3 వ తేదీ నుండి 20 వ తేదీ వరకూ జపాన్‌లో పర్యటించి ఆ దేశపు సంక్షేమ పథకాలను వీటిని అమలు పరచేవిధానాన్ని స్వయంగా చూచివచ్చారు. ఈ పర్యటనలో సంక్షేమ రంగంలో పనిచేస్తూన్న అనేకమంది కార్యకర్తలను కలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ సమస్యలపై జరిగిన ముఖ్యమైన చర్చలలో పాల్గొనడమే కాకుండా అనేక సమావేశాలలో భారతదేశపు సంఘ సేవికగా తమ 12 వయేటనుంచీ బాపూజీ నాయకత్వాన పనిచేసిన తమ అనుభవాలను వివరించారు

ఏప్రిల్ 4 వ తేదీన జపాన్ సాంఘిక సంక్షేమ రంగంలో ప్రముఖులైన వ్యక్తులను కలుసుకొని, స్త్రీ సంక్షేమాన్ని గురించీ, కుటుంబాలకి సలహాలిచ్చే విషయాలపైనా, తదితర సాంఘిక సమస్యల మీదా శ్రీమతి దేశ్‌ముఖ్ చర్చలు సాగించారు. ఈ సమావేశములో మిస్ ఆయీకుమే (లాయరు), మిస్ పియోసకనీషి (విమర్శకురాలు), శ్రీమతి నొహూకో టకహాషీ (వుమెన్స్ అండ్ మైనర్స్‌బ్యూరో. స్త్రీల విభాగానికి ప్రధానోద్యోగిని,) శ్రీమతి సుమికోట నాకా (విమర్శకురాలు), మిస్ యోషికోటొటొకి (కుటుంబవిషయిక సంస్థ), శ్రీమతి మట్సూయో యమామోటో (గృహసంబంధ శాఖ అధ్యక్షురాలు) మున్నగు ప్రముఖులు పాల్గొన్నారు

ఆనాటి మధ్యాహ్నం, ఇంటర్నేషనల్ హౌస్ ఆఫ్ జపాన్ భవనంలో పత్రికా ప్రతినిధుల సమావేశంలో శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మాట్లాడారు.

ఆ మరునాడు శ్రీ యోషీమేడా (ప్రొఫెసర్ టోకియో విశ్వవిద్యాలయం) టకేచియో మట్సూడా (విద్యాశాఖ మంత్రి) యూచీ సెయిటో (ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వశాఖ దౌత్య సంబంధోద్యోగి) ఇవావోయసూడా (ఆరోగ్య, సంక్షేమశాఖల ఉప మంత్రి), మిస్ టాకీఫుజిటా (స్త్రీ సమస్యా పరిశోధక సంస్థ అధ్యక్షురాలు), మిస్ ఫ్యూసే ఇచికావా (హౌస్ ఆఫ్ కౌన్సిలర్స్ సభ్యురాలు) మున్నగు ప్రముఖులను శ్రీమతి దేశ్‌ముఖ్ కలుసుకున్నారు.

స్త్రీల, మైనర్ల సంస్థ

ఏప్రిల్ 6 వ తేదీన కార్మిక, ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధ్వర్యాన నిర్వహింపబడుతూన్న స్త్రీల, మైనర్ల సంస్థను సందర్శించి, కార్మిక మంత్రితో ముఖ్యమైన చర్చలు జరిపారు. ఈ సంస్థ 1947 లో స్థాపింపబడింది. పరిశ్రమలలో పనిచేస్తూన్న స్త్రీల, బాలుర రక్షణ, కార్మిక స్త్రీల పురోభివృద్ధి సాధించడం ఈ సంస్థ ముఖ్యమైన విధులు. రెండవ ప్రపంచ యుద్ధం ఆఖరవగానే జపాన్ దేశపు కార్మిక స్త్రీల, బాలుర సంక్షేమం కోసం 'స్త్రీల, మైనర్లసంస్థ' స్థాపింపబడింది. జపాన్ రూపొందించిన కొత్త రాజ్యాంగం స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని, ప్రాథమిక మానవ హక్కులన్నీ సాధించడానికి వాగ్దానం చేసింది: మైనరు కార్మికుల విభాగం, స్త్రీ కార్మికుల విభాగం, స్త్రీల విభాగం— ఈ మూడు శాఖల ద్వారా ఈ సంస్థ పనిచేస్తూంది సాంఘిక సంక్షేమ రంగంలో ప్రముఖులైన 30 మంది సభ్యులతో సలహా సంఘం ఏర్పాటై ఈ సంస్థ కార్యకలాపాల పర్యవేక్షణ జరుగుతుంది. ఈ సలహా సంఘంలో స్త్రీలూ, పురుషులూ కూడా వుంటారు.

ఒసాకాలో

టోకియోనుంచి ఏప్రిల్ 7 వ తేదీన, శ్రీమతి దేశ్ ముఖ్ ఒసాకాపట్టణం చేరుకున్నారు. ఆనాటి మధ్యాహ్నం కాన్సాయ్ ప్రాంతాన్నుంచి నగరపాలన సంఘాలు, తదితర స్థానిక సంస్థల నుంచి వచ్చిన స్త్రీ ప్రతినిధులు ఇరవై మంది శ్రీమతి దేశ్ ముఖ్ గారిని కలుసుకొని చర్చలు జరిపారు. విడుదలచేయబడిన ఖైదీల సమస్యలు, జనాభాని అరికట్టడం, నైతిక విద్య ఐచ్ఛిక సాంఘిక సేవ, స్త్రీ కార్మికుల ప్రతిపత్తి, కుటీర పరిశ్రమలు మొదలైన వివిధ విషయాలమీద దాదాపు మూడు గంటల సేపు చర్చ జరిగింది. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం వుంటేనే కాని రాజకీయంగాను, విద్యావిషయకంగాను, న్యాయ శాస్త్రరీత్యాను సమానహక్కులు వుండే అవకాశం లేదని శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ ఈ సమావేశంలో విశదం చేశారు.

భారత నారీలోకానికి ఒక విశిష్టమైన నాయకురాలు

జపాన్ దేశంలో విశేషప్రచారం కలిగిన "మనిషి" అనే దిన పత్రిక "గాంధీజీ నాయకత్వాన బాల్యంలోనే భారత స్వాతంత్ర్య సమరరంగంలో ప్రవేశించిన విశిష్ట నారీమణి. భారతదేశపు ఆర్థిక, సాంఘిక, విద్యారంగాల పునర్నిర్మాణానికి పురోగమనానికి నిర్విరామంగా కృషిచేస్తూన్న నాయకురాలు" అని శ్రీమతి దేశ్ ముఖ్ ని ప్రస్తుతించింది.

కుటుంబజీవన సంవర్ధక సంస్థ

వ్యవసాయ మంత్రిత్వశాఖ 1948 వ సంవత్సరం నుంచీ 'కుటుంబ జీవన సంవర్ధక సంస్థ యెడల శ్రద్ధ వహించి, ఈ సంస్థ కార్యకలాపాలను' కుటుంబజీవన సలహాదారులు ద్వారాను, నిపుణుల ద్వారానూ వివిధ ప్రణాళికలను అమలు పరచేటట్లు చేస్తూంది. దేశం నలుమూలలా ఈ సంస్థ కార్యకలాపాలు అన్ని తరగతుల ప్రజలలోనూ వ్యాప్తి చెందేటట్లు ఈ సంస్థ శ్రద్ధతీసుకుంటుంది. ఈ సంస్థకు చెందిన కార్యకర్తలు ఈ కృషికి ఎంతగానో తోడ్పడుతూన్నారు. ఈరంగంలో తరిఫీదు పొందడానికి భారత దేశంతో సహా ఆగ్నేయ ఆసియాలోని ఇతరదేశాల అభ్యర్థులకుకూడ అవకాశాలు వుంటాయి.

స్త్రీలకు సమానప్రతిపత్తి—మహిళాసప్తాహాలు

1946 వ సంవత్సరం ఏప్రిల్ 10 వ తేదీన జపాన్ స్త్రీలు చిరకాల వాంఛితమైన సమాన హక్కులు సిద్ధించాయి ఈ విజయాన్ని పురస్కరించుకొని 1948 వ సంవత్సరం ఏప్రిల్ 10 తేదీని జపాన్ దేశంలో వివిధ నగరాలలో స్త్రీలందరూ సమావేశమై ఉత్సవాలూ, సభలూ జరుపుకున్నారు. ఆ మరుసటి సంవత్సరం నుంచీ స్త్రీల మైనర్లసంస్థ అధ్వర్యాన ఈ మహిళా సప్తాహ ఉత్సవాలు ఏటేటా ఏప్రిల్ 10. 16 తేదీలలో జరుగుతున్నాయి. స్త్రీల అభివృద్ధికి సంబంధించిన అనేక కార్యక్రమాలు ఈ ఉత్సవాలలో నిర్వహింప బడుతున్నాయి.

ఈ ఉత్సవాలును మొదట కార్మిక మంత్రిత్వశాఖ ప్రారంభించినా క్రమేణా అనేక సంస్థల స్త్రీ, పురుషులు దేశమంతటా ఉత్సాహంగా ఇందులో పాల్గొని జయప్రదంగా నిర్వహిస్తూన్నారు. ఈ సంవత్సరం 12వ వార్షికోత్సవం జరిగింది. అనేక స్థానికసంస్థలు, రేడియో, పత్రికా సంస్థలు ఈ ఉత్సవాలలో పాల్గొన్నాయి. ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలలో ఒక నినాదాన్నిచ్చి, ప్రజలు దానిని ఉత్సాహంతో [illegible]

రూపంలో పెట్టేటట్లు కృషి జరుగుతూంది. ఈ సంవత్సరపు నినాదం "మీకాలాన్ని సద్వినియోగం చేసుకొనే విధానాన్ని మీరే నిర్ణయించుకోండి."— ప్రతి దినం కొంత తీరిక చేసుకొని ఆ సమయాన్ని మీ అభివృద్ధికీ, మీవారుగువారి అభివృద్ధికీ వినియోగించండి— అన్నది ఈ నినాదపు ముఖ్యోద్దేశం. టోకియో నగరంలో ఏప్రిల్ 13 వ తేదీ నుంచీ 16 వ తేదీ వరకూ ఈ సంస్థ జాతీయ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలో ముఖ్యమైన చర్చనీయాంశం "దినచర్య ఏర్పాటు— తీరిక సమయాన్ని సద్వినియోగం చేసుకొనడం" అన్నది.

జాతీయ మహిళా మహాసభను సందేశం.

8 వ జాతీయ మహిళా మహాసభ ప్రారంభ సమావేశంలో శ్రీమతి దేశ్‌ముఖ్ పాల్గొన్నారు. స్త్రీల, మైనర్ల సంస్థ డైరక్టరు శ్రీమతి సెట్సూటానినో ప్రారంభోపన్యాసం ఇచ్చారు. కార్మిక మంత్రి శ్రీ రైజోమటూనో, జపాన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ హడోడామోన్మా, ఈ సమావేశంలో ఉపన్యసించారు. ఈ సమావేశానికి అభినందన సందేశ మిస్తూ శ్రీమతి దేశ్‌ముఖ్ ఇలా అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతూన్న ఈఉత్సవాలలో పాల్గొనడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. 1946 వ సంవత్సరంలో చట్టరీత్యా స్త్రీలకు పురుషులతో సమానప్రతిపత్తి, ఓటింగుహక్కు ఇవ్వబడింది. 1946 వ సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీన మొదటిసారిగా జపాన్ దేశపు స్త్రీలు తమ ఓటింగుహక్కును వినియోగించారు. ఆనాటినుంచీ అనేకరంగాలలో స్త్రీలుఘనవిజయాలు సాధించారు. ఈ స్వల్ప వ్యవధిలోనే మీరు సాధించిన విజయాలకు నా అభినందనలు తెలుపుతున్నాను.

ఈ సంవత్సరం జరుగుతూన్న ఉత్సవాలలో "మీ కాలాన్ని సద్వినియోగం చేసుకొనే విధానాన్ని మీరే నిర్ణయించుకోండి" అన్న విషయానికి ప్రాధాన్యం ఇవ్వబడింది. మీ గృహానికీ, మీకూ, సంఘానికీ తద్వారా దేశానికీ దీనిద్వారా ఎంత ఉపయోగం జరుగుతుందో వేరే చెప్పనక్కరలేదు. కాని కాలాన్ని సద్వినియోగం చేసుకొనడంలో ఎంతో జాగ్రత్తగా మన కార్య క్రమాన్ని ఏర్పాటు చేసుకోవలసి వుంటుంది. ఈ సమావేశంలో పాల్గొంటూన్న ప్రఖ్యాత మహిళా ప్రతినిధులు తమ అమూల్యమైన సలహాల ద్వారా, [illegible] ఒక విశిష్టమైన మార్గాన్ని. కార్యక్రమాన్ని సూచించి, తద్వారా దేశపురోభివృద్ధికి తోడ్పడతారనడంలో సందేహంలేదు. జపాన్ దేశపు జాతీయ మహిళామహాసభవారు ఈ సలహాలను కార్య రూపంలో అమలుపరచి, వివిధ రంగాలలో ఇతోధికమైన విజయాలను సాధించి సిరిసంపదలతో, దేశపురోభివృద్ధికీ శాంతిస్థాపనకీ నిర్విరామంగా కృషి చేస్తారని ఆశిస్తున్నాను. ఈ కార్య సాధనలో మీకు విజయము చేకూరాలని కోరుతున్నాను.

శ్రీమతి దేశ్‌ముఖ్ సందేశాన్ని రేడియోద్వారా టెలివిజన్ ద్వారానూ ప్రసారం చేశారు.

శ్రీమతి దేశ్‌ముఖ్ స్త్రీల హక్కుల కోసం నిర్విరామంగా కృషి చేస్తూన్న మణి

నాటి సాయంత్రం జపాన్ దేశపు అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యాన భారతదేశములో సంఘములో స్త్రీ స్థానము అను విషయముపై ఉపన్యసించడానికి శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌ను ఆహ్వానించారు. భారత స్త్రీల హక్కుల కోసం నిర్విరామంగా పని చేస్తున్న మహిళామణి అనీ, సాంఘికరంగంలో స్త్రీల పురోభివృద్ధికి అనేక చట్టాలను ప్రవేశ పెట్టిన మార్గదర్శికురాలు అనీ ఈసంస్థవారు శ్రీమతి దేశ్‌ముఖ్‌ను ప్రశంసించారు.

అంగవైకల్యం పొందిన వారికి పునరావాస కేంద్రం

అంగవైకల్యం పొందినవారి నిమిత్తం ఏర్పాటు చేయబడిన జాతీయ సంస్థను ఆమరునాడు శ్రీమతి దేశ్‌ముఖ్ సందర్శించారు. ఈ కేంద్రం 1949 వ సంవత్సరం అక్టోబరు నెలలో సగమిహారాలో స్థాపింపబడింది. ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వశాఖ ఈశాఖను నిర్వహిస్తూంది. అంగవైకల్యం పొందిన ప్రతి ఒక్కరినీ పరీక్షించి, అవసరమైతే శస్త్ర చికిత్స చేసిన తరువాత కృత్రిమ అవయవాలనుకూడా అమర్చి, వారి వారి అంగవైకల్యానికి తగినట్లు వివిధ వృత్తులు వారికి కల్పింపబడతాయి. వారి వారి అభిరుచులకు తగినట్లుగా వాతావరణము కల్పింపబడి, సంఘంలో సంతృప్తిగా జీవనం గడిపేందుకు అనువుగా తగినశ్రద్ధ తీసుకోబడుతుంది. ఇతర సంక్షేమ సంస్థలుకూడా ఈ కేంద్రానికి తోడ్పడతాయి.

జాతీయ సాంఘిక సంక్షేమసంస్థ

టోకియో నగరంలో జాతీయ సాంఘిక సంక్షేమ

సంస్థవీ సంఘ సేవకులకు తర్ఫీదు నిచ్చే పాఠశాలనీ, శ్రీమతి దేశ్‌ముఖ్ సందర్శించారు జపాన్ దేశపు జాతీయ సాంఘిక సంక్షేమ సంస్థ 1957 లో స్థాపించబడింది ఈ సంస్థ టోకియో నగరంలోని తదిత సాంఘిక సంక్షేమ సంస్థలూ కలిసి వృద్ధులకి ఏర్పాటైన వసతి గృహాలును, పునరావాస సంస్థలకు బాలుర వసతి గృహాలకీ, మాతాశిశు శరణాలయాలకీ, అంగవైకల్యము పొందిన వారికోసం ఏర్పాటైన కేంద్రాలకీ, శారీరకం గానూ, మానసికంగానూ వెనుక పడి వున్న నారీరక్షణకు ఏర్పాటైన సంస్థలకీ, బాలనేరస్థుల పునరావాసానికి ఏర్పాటైన కేంద్రాలకీ, కుంటి, గ్రుడ్డి, మూగబాలుర రక్షణాలయాలకీ సహాయం చేయడమే కాకుండా చనిపోయి నవారి అంత్య క్రియలకు కావలసిన సహాయం, ఆర్థికంగా కష్టపడుతూన్న వారి కుటుంబాలకు ఋణ రూపంలో ధన సహాయం ప్రకృతి సిద్ధంగా వచ్చిన భూకంపాలు, తుఫానులు, మొదలైన ఉపద్రవాలకు సహాయనిధి గృహ నిర్మాణానికి సహాయం, మొదలైన సంక్షేమ కార్యక్రమాలను అనేకవిధాలతోడ్పడుతున్నాయి



జపాన్ బాలికలతో దేశ్‌ముఖ్ దంపతులు

సాంఘిక సంక్షేమనిధి

జపాన్ దేశంలో సాంఘిక సంక్షేమనిధి ఉద్యమం 1947 లో ప్రారంభంప బడింది దేశంలో వివిధ ప్రాంతాలలోని ఐచ్ఛిక సంస్థలకి ఈనిధి వినియోగింపబడుతుంది ఈనిధి తూందో ఆ ప్రాంతపు ప్రజల ఉపయోగానికి ఈనిధిని వినియోగిస్తారు ప్రజల వద్దనుంచి నిర్బంధంగా కాకుండా తమంత తాముగా ఇచ్చిన విరాళాలనే వసూలు చేయాలనే నియమం పాటించ వలసిందిగా

రాలుకాలంలో ఈ నిధి వసూళ్ళు దేశవ్యాప్తంగా జరుగుతాయి. 1053 వ సంవత్సరంలో ఈనిధిద్వారా 15,474 సంస్థలు సహాయం పొందాయి.

సంఘసేవలో తర్ఫీదునిచ్చే పాఠశాల

జపాన్ దేశంలో ఈ పాఠశాల 1946 వ సంవత్సరం నవంబరు మాసంలో స్థాపింపబడింది సంఘ సేవకులకు తర్ఫీదునిచ్చే నిమిత్తం. ఈ పాఠశాలలో నాలుగు సంవత్సరాల శిక్షణ విభాగం ఒకటీ, పట్టభద్రులకి ఒక సంవత్సరం శిక్షణ నిచ్చే భాగం ఒకటీ; ప్రతిదినం సాయంత్రం ఏర్పాటైన తరగతులలో ఒక సంవత్సరకాలం తర్ఫీదునిచ్చే విభాగం ఒకటీ వున్నవి. విశేషం ఏమిటంటే ఇక్కడ పాఠశాలలో చెప్పిన విషయాలను కార్యరూపంలో పెట్టడానికీ, స్వయంగా చూసి తెలుసుకోడానికి తగిన అవకాశాలు కల్పింపబడతాయి.

సాంఘిక భద్రత

వివిధ రకాల 'ఇన్సూరెన్సు' విధానం ద్వారా ఆయావృత్తులలో వుండేవారికి భద్రత చేకూరుతూంది. ఆరోగ్య, మంత్రిత్వ శాఖ పర్యవేక్షణ క్రింద ఆరోగ్య భీమాపథకం, జాతీయ ఆరోగ్య భీమాపథకం, నావికుల భీమాపథకం, పింఛను భీమాపథకం, దినసరిపనివారల భీమాపథకం— ఏర్పాటుచేశారు. కార్మిక మంత్రిత్వ శాఖవారు ప్రమాదాలకు సంబంధించిన భీమాపథకం, నిరుద్యోగులకు భీమాపథకం అమలు జరుపుతున్నారు ఆర్థిక, విద్యా మంత్రిత్వశాఖవారు ఉపాధ్యాయులకీ, ఈ రంగంలో పనిచేస్తూన్న ఇతర పనివారలకీ ఇదేవిధంగా భీమాపథకాలను ఏర్పాటు చేశారు.

అవిటివారికి ఆస్పత్రి, వసతిగృహం

1937 వ సంవత్సరం నుంచీ పని చేస్తూన్న ఈ అస్పత్రినీ, వసతిగృహాన్నీ శ్రీమతి దేశ్‌ముఖ్ ఏప్రిల్ 18 వ తేదీన సందర్శించారు: 1950 లో ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వ శాఖవారు ఈ ఆస్పత్రిని పునర్నిర్మించి, జపాన్‌దేశపు అవిటి పిల్లల సంక్షేమ సంస్థవారికి అప్పగించారు. అప్పటినుంచీ విస్తృతమైన సౌకర్యాలతో ఒక ఆదర్శ సంస్థగా వర్థిల్లుతూంది. ఈసంస్థ అవిటివారికి ఆరోగ్యకేంద్రంగా, విద్యా సంస్థగా వివిధ సౌకర్యాలతో వారిపాలిటి కల్పతరువుగా పని విద్యా సౌకర్యాలు కూడా, కల్పింపబడినాయి. వీరి చికిత్సకయే ఖర్చులకు విరాళాల ద్వారా వచ్చిన ధనం ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఈ విధంగా వచ్చేధనంలో నూటికి ఎనభై వంతులు ప్రభుత్వంనుంచే వస్తూంది. తక్కిన స్వల్పధనం చికిత్స పొందేవారి కుటుంబంద్వారా సమకూడుతుంది.

ఏప్రిల్ 15 వ తేదీ మధ్యాహ్నం. 'ఇండియా స్టడీ గ్రూప్ ఆవ్ ఇంటర్‌నేషనల్ హౌస్ ఆఫ్ జపాన్' వారు ఏర్పాటుచేసిన చర్చలో ప్రత్యేకంగా పాల్గొనవలసినదిగా శ్రీమతి దేశ్‌ముఖ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు ఆ సమావేశంలో "గాంధీజీ దృష్టిలో మహిళలపాత్ర" అనే విషయాల మీద మాట్లాడవలసినదిగా శ్రీమతి దేశ్‌ముఖ్ గారిని కోరారు. సభ్యులు ఎంతో ఆసక్తితో ఈ చర్చలో పాల్గొనడమే కాకుండా ఎంతో శ్రద్ధతో శ్రీమతి దేశ్‌ముఖ్ ప్రసంగాన్ని విన్నారు.

ఆనాడే భారీ యంత్రాలను తయారుచేసే సహకార సంస్థలనీ, చిన్నతరహా మధ్యతరగతి పరిశ్రమల విభాగాన్ని సందర్శించారు. టోకియో నగరంలోని ఇతర సహకార సంఘాల్నీ, ముఖ్యంగా 'హితాచీ సంస్థ'నీ సందర్శించారు.

ఒక నోమిజా మహిళా విశ్వవిద్యాలయంలో:

టోకియోనగరంలో ఏప్రిల్ 18 వ తేదీన ఒక నోమిజా విశ్వవిద్యాలయంలో ఉపన్యసించ వలసినదిగా శ్రీమతి దేశ్‌ముఖ్‌ను ఆహ్వానించారు. మహిళల ఉన్నత విద్యకై ప్రభుత్వము వారు నడుపుతూన్న రెండు సంస్థలలో ఇది ఒకటి. ఉపన్యాసం అయిన తరువాత శ్రీమతి దేశ్‌ముఖ్ విద్యార్థినులతో చర్చలు జరిపారు.

కుటుంబ న్యాయస్థానాలు సాధించిన విషయం:

బాల నేరస్థుల్నీ, ప్రత్యేకం కుటుంబాలకి సంబంధించిన తగవుల్నీ విచారించడానికి ఏర్పాటు చేయబడిన కుటుంబ న్యాయస్థానాలు శ్రీమతి దేశ్‌ముఖ్ గారిని ఎంతో ఆకర్షించాయి. ఆధునిక సాంఘిక సమస్యల్ని దృష్టిలో పెట్టుకుని, సంసారంలో వచ్చిన ఆ తగవుకి కారణాలేమిటో సమగ్రంగా పరిశీలించి, పరిష్కారానికి తగు సలహాల్ని న్యాయస్థానాలు ఇస్తాయి. ఏయే పరిస్థితులు ఈ నేరం జరగడానికి [illegible] అనే విషయాల్ని సానుభూతితో

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the month of June, 1960.

OUT-PATIENT REGISTER

	No. of Surgical cases treated	39
	„ „ Medical „ „	895
	„ „ Gyneac „ „	171
	„ „ Ante-natal „ „	252
	„ „ Post-natal „ „	69
	„ „ Dental „ „	12
	„ „ E.E.N.T. „ „	47
Total	„ „ New Patients	1,485
„	„ „ Old Patients	2,047
	Grand Total	3,532

IN-PATIENT REGISTER

No. of Patients admitted of Normal Deliveries	137
-do- do- Abnormal Deliveries : Forceps 15, I.P. Version. 1	16
No. of Ante-natal E False Pains	18
„ „ Ante-natal E Toxeamia	3
„ „ Gynaec cases	39
„ „ Medical „	63
„ „ Post-natal „	2
„ „ Babies admitted as Lodgers	144
Grand Total	422

Sd.) Dr. K. R. AMBUJA, *R. M. O.*

(Sd.) Dr. M. PAVANA BAI, *Medical Superindent.*

(Sd) Smt. V. LAKSHMI PARVATHI, *Secretary.*



రాజకీయాలు

"జీ"

భాషాభిమానం పేరిట ఇటీవల అస్సాంలో జరిగిన సంఘటనలు దేశశ్రేయస్సును కోరే ఏవ్యక్తికైనా బాధకలిగించకమానవు. తనభాష-తన సంస్కృతి అనేవి నిజంగా గర్వించతగిన విషయాలే. కాని "తన భాషదేపైచేయి" అనే మూర్ఖపు పట్టుదలతో సోదర భాషలను అవమానం చేయడం, ఆఖరికి నువ్వు నాభాషకి జోహారు చేస్తేనే చేశావు. లేకపోతే నీప్రాణాలు నీకు దక్కవు" అనేటంత రాక్షస మనస్తత్వం ఇటీవల కామరూప దేశంలో (అస్సాంలో) విలయతాండవం చేసిందంటే ఇంకా మనం ఆటవిక మనస్తత్వానికి ఎంత దగ్గరగా వున్నామో అర్థమౌతుంది! మన రాజ్యాంగం ప్రాంతీయ భాషలన్నిటికీ సమానప్రతిపత్తినే ప్రసాదించింది. అదీకాక "ఏ భాష మాట్లాడే వారైనా, ఏ ప్రాంతానికి చెందిన వారైనా, భారత దేశంలో ఏ ప్రాంతంలోనైనా స్వేచ్ఛగా, నిర్భయంగా, గౌరవనీయ వృత్తితో జీవించవచ్చునని" మన రాజ్యాంగం భరోసా ఇచ్చింది.

అస్సాం రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాలలాగే, అస్సామిస్ భాషకాకుండా ఇతరభాషలు మాట్లాడేవారు ఎంతో మంది వున్నారు. వీరిలో పొరుగు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ కి చెందిన వారు అధిక సంఖ్యాకులుగా వున్నమాట వాస్తవమే. ఏ పనైనా ఐచ్ఛికంగా మనస్ఫూర్తిగాచేస్తేనే రాణిస్తుంది కాని నిర్బంధించి ఒకరిచేత ఆపనిని చేయించదలచుకొంటే దాని ఫలితం విపరీత పరిణామాలకి దారి తీస్తుంది. ఈ భాషావైషమ్యాల కారణంగా గడచిన కొద్ది రోజులలో వేల సంఖ్యంలో బెంగాలీలు అస్సాం రాష్ట్రం నుంచి తమ ఇళ్ళనీ, ఆస్తిపాస్తుల్నీ విడచి, అరచేతిలో ప్రాణాలుపెట్టుకొని పారిపోవలసి వచ్చిందంటే, దేశ విభజన కాలంనాటి దారుణసంఘటనలు జ్ఞాపకంరాకమానవు. ప్రధాని నెహ్రూ కల్లోలిత ప్రాంతాలను పర్యటించి, కాందిశీకుల పునరావాస సౌకర్యాలను స్వయంగా పరిశీలించి వచ్చారు. "ఇది అస్సాం రాష్ట్రంలో జరిగింది కనక ఈ బాధ్యత అస్సాం ప్రజలే వహించ వలసి వుంటుంది. భయభ్రాంతులై తమ తమ ఇళ్ళను వదలి వెళ్ళి పోయిన వారికి ధైర్యంచెప్పి, తమ తమ స్థానాలకి వారినందరినీ చేర్చవలసిన బాధ్యత అస్సాం ప్రజలపైన వున్నది. మన దేశంలో వివిధరాష్ట్రాలలో రాష్ట్రేతరులు వేలసంఖ్యలో కాకుండా లక్షల సంఖ్యలోనే వుంటారు. సంఖ్యాబలం ఎక్కువగా వున్నదికదా అనే ధీమాతో పైశాచిక మనస్తత్వానికి, పశుబలానికి అవకాశం ఇస్తే ఇక దేశం ఏనాటికైనా బాగుపడుతుందా? ఈ అల్లర్లు అంతటితో ఆగుతాయా? అస్సాంలో వుండే తమ వారికి జరిగిన పరాభవాన్ని మనస్సులో పెట్టుకొని బెంగాల్ ప్రజలు కూడా అదే విధంగా ప్రవర్తిస్తే వారిగతి ఏంకాను? దేశవిభజన సమయంలో జరిగిన పైశాచిక హత్యాకాండ మనకి గుణపాఠం నేర్పవద్దా? ఏమైనా పశ్చిమ బెంగాల్ లో ప్రజలు చూపిన సహనం ప్రశంసనీయమైనది. గాంధేయసిద్ధాంతాలకిది ఒక మచ్చుతునక.

కామరూప ప్రజలు ఇది ఒక గుణపాఠంగా గ్రహించి, ఇకముందైనా తమ సోదర ప్రజలకిలాంటి అన్యాయాలు జరుగకుండా చూస్తారని ఆశిద్దాము. ప్రధాని నెహ్రూ పర్యటన దీనికి చక్కగా తోడ్పడగలదు.

ప్రభుత్వోద్యోగుల సమ్మె, తదనంతర వాతావరణం

జూలై 11 వ తేదీ అర్ధరాత్రి ప్రారంభమైన ప్రభుత్వోద్యోగుల సమ్మె ముగిసింది. ఈ సమ్మె నెదుర్కోడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతమైన చర్యలు తీసుకున్నాయి. అటు ప్రభుత్వ సైనిక దళాలనుంచి, ఇటు స్వచ్ఛంద సైనికులదాకా ప్రభుత్వానికి అండగా నిలిచి సమ్మె కొనసాగకుండా చూశారు. సమ్మెకు ముందు ప్రధాని దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ అటు ఉత్తరాన దురాక్రమణ భయం, ఇటు దేశంలో ప్రణాళికల పెట్టుబడులకి తగినంతడబ్బులేని సమయంలో ప్రభుత్వోద్యోగులు తమ కోరికలను తగ్గించుకొని దేశాభివృద్ధికి, భావితరాల

సింహళ సాంస్కృతిక సంఘాలను ఆమె చేసిన సేవ అపారమైనది.

మొదటి సిలదేలో సెయింట్ బ్రిడ్‌గెట్స్ కాన్వెంటులో విద్యాభ్యాసం చేశారు. 1951 లో శ్రీ బండారు నాయకే శ్రీ లంక ఫ్రీడంపార్టీ. స్థాపించి నప్పటినుంచీ ఆయనకు చేదోడు వాదోడుగా ప్రతి ఎన్నికలలోనూ ఉపన్యాసాలిస్తూ ఆయనకు ఎంతో అండగా వుంటూవచ్చారు. ఈ అనుభవం ఆమెను సింహళ భాషలో అనర్గళమైన వ్యక్తి కావడానికి తోడ్పడింది. 1916 లో శ్రీ బండార నాయకా సింహళ ప్రధాని కాగానే ఆయనతో అమెరికా, కెనడా, బ్రిటన్, భారత దేశాల శ్రీమతి సిరిమావో పర్యటించారు. ఆమె పియానో చక్కగా వాయిస్తారు. టెన్నిస్ అంటే ఎంతో యిష్టం

ఆమెకు సునేత్ర (18 సంవత్సరాలు), చంద్రిక (16 సంవత్సరాలు) అనే పిల్లలూ అనూరా (11 సంవత్సరాలు అనే పిల్లవాడూ వున్నారు.

శ్రీ నెహ్రూ తమ శుభాకాంక్షల్ని అందజేస్తూ చెప్పి ఇట్లు "శ్రీమతి సిరిమావో" సారథ్యాన సింహళ దేశం సిరిసంపదలతో తులతూగి, భారత సింహళ దేశాలమధ్య నతోధిక స్నేహసద్భావాలు ఏర్పడగలవని ఆశించుదాము.

"సుమంగలీ భవ"

పోకల రాజ్యం

పుట్టింది మొదలు పెళ్ళయేవరకు
యెన్నరాని, అనుభూతులు. ఆనందాలు
ఒడినింపుకున్నావు,
బాల్యంలోని-బొమ్మరిల్లు
గుజ్జనగూళ్ళ-గమ్మత్తులు
విశ్వయాత్రకు-ఆనవాళ్లు

కన్యాత్వములోని కలతలు, కయ్యాల
కసరత్తులు భవిష్యత్తులోగల
బాధలకు బయ్యానాలు,
యవ్వనమందు వికసించి వుద్రేకపరచే
తీయని తలపుల మలుపులలో, మొలకెత్తును.
మమకారాల మాధుర్యాలు

కళ్యాణమంటే కళవరపడి కంపింపకు
ఆడజన్మకు-అత్తవారిల్లే
ఆదర్శమైన-ఆలంబన.
ఆత్మీయుల, యెడబాటుయెదలో
ముల్లనే, భయం, భ్రమ
లోకకళ్యాణానికి ఆడదాని ఆసరా
అత్యవుసరమని మరువకు.

నిన్నుతోడ్కొని పోవుటకు.
విచ్చేసినారు-వియ్యాలవారు.
కొన్ని క్షణాలలో నీ ఆరాటం
వరుని హృదయాన్నికి అంకిత
అర్ధాంగానికి అధికారివై వెడలిపోతావు.
పెండ్లి పీటలపై పసుపు బట్టలతో
పలువురు పెద్దలు పిన్నలు చిలికిన
శుభాక్షతల చక్కలిగింతల తికమకలో
బాజాభజంత్రీలు బెండుసన్నాయి
బాకాల కోలాహాలంలో వరుని
హస్తప్రసాదిత. మంగళకరమైన సూత్రం
నీ మెడనలంకరించిన ప్రేమపాశం.

ఈనాడు పరాయివై పోతున్నందుకు
బాధపడకు-అప్పుడప్పుడూ
మాకంటికి కనుపించి, యోగక్షేమాలు, వినిపించు.
కన్నవారు నీకొరకు కన్నీరు కార్చుతున్నా
కొన్నవారు-నీ ఆగమనానికి
హారతులెత్తుతారు.

ప్రపంచ పరిభ్రమణకు
సంయోగ వియోగాలు
అనివార్యన విధానాలు
ప్రతిగృహిణి తనయింటిని జేరి నట్లు
నీ యింటికి నీవు జేరుకుంటున్నావు.
సుమంగళివై సుఖించు.
చిత్ర విచిత్రమైన. జగతిలో, నీ పాత్రను
స్వీకరించి– సిద్ధిపొందు.

అన్నపూర్ణాదేవి మహిళా సంఘము కోరుకొల్లు

పశ్చిమ గోదావరిజిల్లా భీమవరం తాలూకా కోరుకొల్లు గ్రామంలో అన్నపూర్ణాదేవి మహిళా సంఘము యాజమాన్యమున సదరు సంఘములో హిందీ, నవారు నేత, టైలరింగు, సంగీతము, యింకను కొన్ని చేతి పనులు నేర్పబడుచూ ఈ మధ్య ఆ సంఘయాజమాన్య మున ప్రత్యేకముగా బాలికలకు ఒక హయ్యరు ఎలిమెం టరీ పాఠశాల ప్రారంభింపబడి నడుప బడుచున్నది. సదరు స్కూలులో 8 వ తరగతి ప్యాసయిన పిదప కూడ వారలకు శిక్షణ (ట్రైనింగు)కు పంపుటకు అన్న పూర్ణాదేవి మహిళా సంఘమువారే సహాయపడుదురు. ప్రస్తుతము 6 వ తరగతి నడుపబడు చున్నది. సదరు పాఠశాలలో చదువుకొనుటకు ఉత్సాహపడు నిస్సహాయ లగు బాలికలు వెంటనే త్వరపడి చేర గలందులకు కోరు చున్నాము. స్కూలుకు ఒక హాస్టలుకూడ ఉన్నది. దానికి సంబంధించిన యావత్తు విషయములు ప. గో. జి. అర వల్లిలో శ్రీ ద్వారంపూడి పుత్రారెడ్డిగార్ని కలసికొని మాట్లాడినచో తెలియగలవు. కనుక అందరు వెంటనే త్వరపడి తమతమ బాలికలను సదరు స్కూలులో చేర్చు టకు ఉత్సాహపడుదురని నమ్ముచున్నాము. ది 31-7-'60 తేదీ లోపల చేర్చుటకు సిద్ధపడిరావలయును. చేరుటకు వచ్చు పిల్లలు (బాలికలు) 6 వ తరగతిలో చేర్చుట కున్న రూల్సుకు తగినట్లు (అనగా 5 వ. తరగతి ప్యా సయి యుండుట 11 సం.—25 సం. వయస్సులోపు వారై యుండుట) ఉండవలెను.

మనజాతీయ జీవిత పునర్నిర్మాణము విద్యార్థుల కర్తవ్యము-

ప్రచురణ కర్తలు- తెలుగు విద్యార్థి ప్రచురణలు మచిలీపట్నము

ఆచార్య శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్యా ఎం. ఏ గారు రచియించిన ఈ గ్రంథము మన జాతి యొక్క జీవిత పునర్నిర్మాణావశ్యకతను సూచించు చున్నది. పునర్నిర్మాణములకు విజ్ఞానము అవసరము. విజ్ఞానము విద్యవలనగాని పొందుట దుస్సాధ్యము. అట్టి విద్యను గలుపువారు, అట్టి విద్యను అర్థించువారు మిక్కిలి జాగరూకులై శ్రద్ధ వహించిన గాని జాతి యొక్క పునఃసృష్టి వలనుపడదు. ఈ అంశమునే శ్రీ ఆచార్యుల వారు ముఖ్యముగా ఈ గ్రంథము నందు నిరూపించినారు, ఇది విద్యార్థి లోకమున గల స్త్రీపురుషులెల్లరు చదువవలసిన గ్రంథమని వేరే చెప్పనక్కరలేదు. విద్యార్థుల కర్తవ్యమును, అందు నను స్త్రీలయొక్క బాధ్యతను విశదపరచుచున్నది.

జి. సుందరీశంకరం

కాఫీ దండకము

శ్రీమన్మహాదేవా! ఓ ఓ చిరంజీవి, ముదంబారగా నిన్ను సేవింతు, ధ్యానింతు, నిన్నెంచ మేమెంత వారమ్. ఎల్లవేళలన్ మమ్ము దయాదృష్టచూపి రక్షించు చుండుమో తల్లీ!

హాలెండు, పోలెండు, డెన్మార్కు, స్కాట్లెండు, ఇంగ్లండు, ఐర్లెండు, మదరాసు, బెజవాడ, గూడూరు, గుంటూరు, భూపాల, నేపాల, నీలగిరి, మధురగిరి, కోరుకొండ, పెనుగొండ, బొంబాయి, వైజాగ్, అటు పైన భూమండలంబంత వ్యాపించి, ఆమీద ఇంటింట విచ్చేసి ముదుసులన్, ముత్తైదులన్, కుర్రలన్, పెద్దలన్, పిల్లలన్, భేదమొక్కింత లేకుండ వీక్షింతు ఓ తల్లీ!, ఉదయాత్పూర్వమేలేచి, అగ్నిప్రతిష్ఠించి నీళ్ళు వేడిగ కాచి, పాలు చక్కెర కలిపి నిన్నందులోవేసి, ఒడగట్టి ఒక్కొక్క కప్పు ప్రమాణంబుగ గ్రోలంగ, నేస్వర్గ సౌఖ్యంబుపొందుచుంటిరే! ధనేశులైనన్, వనేశులైనన్, యతీశులైనన్, లక్షాధిపతులైన, బిక్షాదిపతులైన, గొప్ప పండితులైన, మూర్ఖపామరులైన, హరిదాసులైన, భూస్వాములైన, అతిసామంతులైనన్, పుణ్యతీర్థంబులన్, పుణ్యకాలంబులన్. పుణ్య కార్యంబులన్, శుద్ధవ్రతంబులన్. ఏకాదశీ, అమావాశ్య, పౌర్ణమీ శివరాత్రి, భోగి సంక్రాంతి, మొదలైన ఈ పుణ్యదినంబులన్. నీ సేవ మరువంగ వీలున్నదే. ఉప్మాలు, ఇడ్లీసాంబార్, చట్నీలు, పెసరట్లు దోసెలు, లాడూలు, బర్ఫీలు, కోవాలు, ఏ టిఫినులైనను నీతీరు రావమ్మ- నీవు రవ్వంత ఆలశ్యమైతేను బుర్రత్రిప్పింపవే! కాళ్ళు పీకింపవే! కడుపు మండింపవే మాయ చూపింపవే! గంతులేయించవే! ఓ తల్లీ కాఫీ దేవి! నమస్తే! నమస్తే! నమోనమః॥





JVZ-178



NOW
IN
TABLETS

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము : హిందీ, కాశీవిశ్వవిద్యాలయప్రవేశ్మిషన్, ఆంధ్రా మెట్రిక్, ఇ.ఎస్.ఎల్.సి., పరీక్షలకు శిక్షణ.

పారిశ్రామిక విద్యాలయము : కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ. బీద విద్యార్థినులకు ఉచితము.

మహిళా మందిరము : విద్యార్థినులకు వసతి గృహము.

ఆంధ్ర మహిళ : స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక

నర్సింగ్ హోమ్ : స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాఖ—అడయారులో నిర్మించబడినది. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్సుఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణకూడ యివ్వబడుచున్నది.

ఆర్థోపీడిక్ సెంటర్ : వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమకేంద్రం.

ముద్రణాలయము : విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూఫురీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్క్సు చేయబడును.

నాగేశ్వర శిశువిహార్ : పిల్లల విద్యావినోద కేంద్రం. ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది

అర్బన్ వెల్ఫేరు ప్రాజెక్టు : కపాలి తోట్టంలోను నారాయణస్వామి గార్డెన్‌లోను బీదలకు సంక్షేమ కార్యక్రమముల నిర్వహింపబడుతోంది

వనితా బాలవిహార్ : స్త్రీలకు, పిల్లలకు- పార్కు, ఆటస్థలం.

రీజియనల్ హాండీక్రాఫ్ట్సు యిన్స్టిట్యూట్ : ఆంధ్రమహిళాసభ, హైదరాబాదుబ్రాంచిచే నడుపబడుచున్న చేతిపనుల శిక్షణాలయము